# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 27, జూన్ 2026


## ఎన్యుమరేషన్ ఫారంలో వాస్తవ వివరాలు నమోదు చేయాలి

★ కలెక్టర్ కె.హరిత



**కెరమెరి, జూన్ 26, ప్రభాతవార్త:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ప్రజలకు అందిస్తున్న ఎన్యుమరేషన్ ఫారంలో వాస్తవ వివరాలు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లాలోని కెరమెరి మండలం మల్లంగి గ్రామంలో కొనసాగుతున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, వివరాల నమోదు ప్రక్రియను అధికారులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు అందిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాల ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. జూలై 24వ తేదీ వరకు నిర్వహించే సర్ ఇంటింటి కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని, ఈ క్రమంలో బూత్ స్థాయి అధికారులు ఓటర్ల వద్దకు వెళ్లిన సమయంలో ఎన్యుమరేషన్ ఫారం అందించినప్పుడు బి ఎల్ ఓ యాప్ లో మార్క్ చేయాలని తెలిపారు. సదరు ఓటరు ఎన్యుమరేషన్ ఫారం నింపిన తరువాత తిరిగి సేకరించి యాప్ లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. మరణించిన వారు, గ్రామం వదిలి వెళ్ళిన వారు, 2 అంతకు మించి ఎపిక్ కార్డులు కలిగి ఉండడం అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఒకరికి ఒక ఓటరు మిగతా 2లో..

అక్రమ మట్టి తవ్వకాలపై

## కలెక్టర్‌కు ఫిర్యాదు

✳ గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్నారని కాంట్రాక్టర్ పై ఆరోపణ

✳ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని విమర్శ

– చెన్నూరు, జూన్ 26, ప్రభాతవార్త

2లో..





విద్యా హక్కు చట్టం అమలు చేయాలని

## విద్యార్థి సంఘాల ఆందోళన

విద్యాశాఖ అధికారుల దిష్టిబొమ్మ దహనం.. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీ పై ఆగ్రహం

**మంచిర్యాల, జూన్ 26, ప్రభాతవార్త**

విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయకుండా రాజ్యాంగం కల్పించిన విద్యా హక్కును కించపరుస్తున్నారని ఆరోపిస్తూ ఐక్య విద్యార్థి సంఘాలు విద్యాశాఖ అధికారుల దిష్టిబొమ్మను దహనం చేశాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో శుక్రవారం ఈ నిరసన కార్యక్రమం

మిగతా 2లో..

## భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 26, ప్రభాతవార్త:** కాగజ్‌నగర్ మండలంలోని బారెగూడ గ్రామంలో హుస్సేన్ హుస్సేన్ ఆశీర్ ఖాన్ వద్ద గత పది రోజులుగా కొనసాగిన మొహర్రం ఉత్సవాలు శుక్రవారం తెల్లవారుజామున భక్తిశ్రద్ధల నడుమ ముగిశాయి. కులామతాలకు అతీతంగా నిర్వహించిన ఈ వేడుకలకు సూదుర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శనం చేసుకొని, మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా గ్రామ వీధుల్లో డప్పు వాయిద్యాలు, ఆటపాటలు, సవారీ నృత్యాల మధ్య పీర్ల ఊరేగింపు వైభవంగా సాగింది. పదో రోజున ఉదయం 5.30 గంటలకు కార్బలా కార్యక్రమంతో ఉత్సవాలు ముగిశాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు తాగునీరు, భద్రత, ఇతర సౌకర్యాలను కల్పించారు. ఉత్సవాల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి మల్లేష్,నందయ్య, మెంగజీ, రామయ్య, గ్రామ పటేల్ గజీని,తిరుపతి, రమేష్,చిన్న, మహిబు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్‌ఘాతంతో

## నవవధువు మృతి

✧ ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ శ్రీనివాస్



**సారంగాపూర్, జూన్ 26, ప్రభాతవార్త:** సారంగాపూర్ మండలం బోరిగాం గ్రామంలో శుక్రవారం విద్యుత్ షాక్‌కు గురై బర్నపల్లి రేఖ(23) అనే నవవధువు అక్కడికక్కడే దుర్మరణం చెందింది. స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. బోరిగాం గ్రామానికి చెందిన వినోద్ భార్య బర్నపల్లి రేఖ తన ఇంటిపై అంతస్తులో బట్టలు ఆరవేసే క్రమంలో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న ఎల్‌టీ విద్యుత్ లైన్ వైర్లపై ఆమె కట్టుకున్న చీర పడింది. దీంతో ఒక్కసారిగా విద్యుత్ ఘాతానికి గురై ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మృతురాలికి వివాహమై కేవలం నాలుగు నెలలు మాత్రమే అవుతోంది. మృతురాలి తల్లిదండ్రులు మహారాష్ట్రలోని అప్పారావుపేటకు చెందిన వారు. కాగా, నివాస గృహాలకు ఇంత దగ్గరగా ప్రమాదకరంగా విద్యుత్ తీగలు మిగతా 2లో..

## విద్యా హక్కు చట్టం అమలు చేయాలని

# విద్యార్థి సంఘాల ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, చేరాల వంశీ మాట్లాడుతూ, విద్య హక్కు చట్టం ప్రకారం ప్రతి కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలో 25 శాతం సీట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, వికలాంగులు మరియు పేద కుటుంబాల పిల్లలకు కేటాయించాల్సి ఉన్నప్పటికీ అధికారులు అమలు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ పుట్టగొడుగుల్లా పెరుగుతున్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు జారీ చేయడం వల్ల విద్య రంగం వ్యాపారమైందని ఆరోపించారు. ఫీజుల పేరుతో తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. విద్యను వ్యాపార వస్తువుగా మార్చి పాఠశాలలను లాభాపేక్ష కేంద్రాలుగా మార్చడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు మేల్కొని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించి, విద్య హక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లను పేదలకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు చిప్పకుర్తి సతీష్ మాదిగ, దుర్గం మనీష్, ముంజంకార్ రితిక్, రౌతు శంకర్ కుమార్, శశి, ప్రశాంత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్యుమరేషన్ ఫారంలో వాస్తవ వివరాలు నమోదు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

గుర్తింపు కార్డు మాత్రమే ఉండేలా స్పష్టమైన జాబితా రూపొందించాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలు నింపిన తరువాత తిరిగి సేకరించి బి ఎల్ ఓ యాప్ లో ఎలాంటి పొరపాట్లు లేకుండా వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని, ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియ నిర్వహణలో బూత్ స్థాయి ఏజెంట్లు, యువజన సంఘాల ప్రతినిధులు, వాలంటీర్లు, కుల పెద్దల సహకారం తీసుకోవాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఐఅండ్‌పిఆర్ కమిషనరేట్ ముట్టడికి నిర్మల్ నుంచి తరలిరండి

### - ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్

**నిర్మల్, జూన్ 26, ప్రభాతవార్త:**

మీడియా రంగంలో అర్హులైన అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియలో దళిత, గిరిజన జర్నలిస్టులపై తీవ్ర వివక్ష కొనసాగుతోందని, ఈ అన్యాయాన్ని నిరసిస్తూ జూన్ 29న హైదరాబాద్‌లోని సమాచార, పౌర సంబంధాల శాఖ (ఐఅండ్‌పిఆర్) కమిషనరేట్‌ను ముట్టడించనున్నట్లు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంటోల్ల వెంకటస్వామి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఈరోల్ల పురుషోత్తం పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అక్రిడిటేషన్ కార్డుల పంపిణీలో దళిత, గిరిజన జర్నలిస్టులను కావాలనే పక్కన పెడుతున్నారని ఆరోపించారు. అక్రిడిటేషన్ల జారీ కోసం ఏర్పాటు చేసిన కమిటీలలో ఇతర సామాజిక వర్గాల ఆధిపత్యమే కొనసాగుతోందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వరకు మారిన పాలనలోనూ తమ సామాజిక వర్గ జర్నలిస్టుల పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులందరికీ ఎలాంటి కొర్రీలు పెట్టకుండా వెంటనే అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని, మీడియా కమిటీలలో దళిత, గిరిజన ప్రతినిధులకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. దీనితో పాటు రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల కోసం అమలు చేసే ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు వంటి వివిధ సంక్షేమ పథకాల్లో ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అలాగే క్షేత్రస్థాయిలో కష్టపడుతున్న దళిత, గిరిజన జర్నలిస్టుల పిల్లలు ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుకుంటే వారికి వంద శాతం ఫీజు రాయితీ వర్తింపజేసి ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జూన్ 29న హైదరాబాద్‌లో జరగబోయే ఐఅండ్‌పిఆర్ కమిషనరేట్ ముట్టడి కార్యక్రమంలో నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న దళిత, గిరిజన జర్నలిస్టులు, వివిధ బహుజన సామాజిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, న్యాయవాదులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### అక్రమ మట్టి తవ్వకాలపై

## కలెక్టర్‌కు ఫిర్యాదు

**చెన్నూరు, జూన్ 26, ప్రభాతవార్త**

ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా గ్రామంలో మట్టి తవ్వకాలు జరుపుతున్నారని స్కూల్ కాంట్రాక్టర్ పై సోమన్ పల్లి గ్రామస్తులు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం సోమనపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు మొదలయ్యాయి. నిర్మాణానికి అవసరమయ్యే మట్టిని గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా కాంట్రాక్టర్ గ్రామంలోని అసైన్డ్ భూముల్లో జేసీబీ ట్రాక్టర్లతో అక్రమంగా తవ్వకాలు జరిపి మట్టిని తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ మట్టి రవాణాపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోక మామూలుగా తీసుకుని వదిలేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

## ఎస్సీల వర్గీకరణ ఫలాలు పొందాలంటే ప్రతి ఒక్కరూ చదువుకోవాలి

**ఆసిఫాబాద్, జూన్ 26, ప్రభాతవార్త :**



ఎస్సీల వర్గీకరణ ఫలాలు పొందాలంటే ప్రతి ఒక్కరూ చదువుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రేగుంట కేశవ్ రావ్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్థానిక బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ప్రాంగణం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మాట్లాడారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ పిలుపుమేరకు గో టు విలేజ్ పేరుతో జిల్లాలోని మండలాల్లో ప్రతి గ్రామములో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నాయకులు విద్యార్థులను చైతన్య పరుచడానికి చదువుపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాబాసాహెబ్ ఆశయలు గుర్తు చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. అదేవిధంగా జూలై 7న నిర్వహించే 32వ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని, జిల్లాలోని ప్రతి గ్రామంలో దండోరా గద్దెలు నిర్మాణం చేయాలన్నారు. జిల్లాలోని మాదిగ ఉప కులాలు మాదిగ జాతి ఆత్మగౌరాన్ని కాపాడుకోవడం కొసం ప్రతి ఒక్కరూ పాల్గొని ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఇప్ప నాగరాజు, జయరాజు మండల నాయకులు రాజలింగు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌ఘాతంతో నవవధువు మృతి

(మొదటిపేజీ తరువాయి)

ఉండటమే ఈ ప్రమాదానికి కారణమని, ఇది ముమ్మాటికీ విద్యుత్ శాఖ అధికారుల నిరక్ష్యమేనని మృతురాలి తండ్రి రాజన్న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి దరఖాస్తు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీఈ దారుణ సంఘటన జరిగిన బోరిగాం గ్రామాన్ని నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్ ఆకస్మికంగా సందర్శించి, ప్రమాదం జరిగిన తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నివాసాల మధ్య ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను తొలగించడంలో నిరక్ష్యం వహించిన ఎలక్ట్రిసిటీ సిబ్బంది, అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా గ్రామస్థులు డీఎస్పీని డిమాండ్ చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ గ్రామస్థులకు హామీ ఇచ్చారు.



## 32వ డివిజన్ బ్రిడ్జి పనులను పరిశీలించిన మేయర్

### - ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు కృషితో దశాబ్దాల కల సాకారం

**నస్పూర్, జూన్ 26, ప్రభాతవార్త**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32వ డివిజన్ రాంనగర్, అల్లూరి సీతారామరాజు నగర్ ప్రాంతాలను కలుపుతూ నిర్మిస్తున్న నూతన బ్రిడ్జి నిర్మాణ పనులను శుక్రవారం మేయర్ ధర్ని మధుకర్ స్థానిక ప్రజలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ ధర్ని మధుకర్ మాట్లాడుతూ.. ఈ బ్రిడ్జి నిర్మాణం 32వ డివిజన్ ప్రజల దశాబ్దాల కల అని పేర్కొన్నారు. స్థానిక ప్రజల ఇబ్బందులను గుర్తించిన మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు డివిజన్ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధతో ఈ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని తెలిపారు. బ్రిడ్జి అందుబాటులోకి వస్తే రెండు ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యం ఎంతో మెరుగవుతుందని వెల్లడించారు. వర్షాకాలం దృష్ట్యా కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించి నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్‌తో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా మొహర్రం వేడుకలు

- భక్తిశ్రద్ధలతో తాజియాల ఊరేగింపులు
- సామరస్యానికి ప్రతీకగా నిలిచిన వేడుకలు





**మంచిర్యాల, జూన్ 26, ప్రభాతవార్త**

మంచిర్యాల నగర కార్పొరేషన్ పరిధిలో మొహర్రం వేడుకల సందర్భంగా భక్తి, ఆధ్యాత్మికత, సామరస్య భావాలతో కళకళలాడింది. ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో మొహర్రం ఆచరించగా, పట్టణంలోని పలు ప్రాంతాలు ప్రార్థనలు, ఊరేగింపులతో సందడిగా మారాయి. మొహరం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన తాజియాలను భక్తులు సంప్రదాయబద్ధంగా ఊరేగింపుగా తీసుకెళ్లి తమ విశ్వాసాన్ని, ఆచారాలను ఘనంగా ప్రదర్శించారు. ఉదయం నుంచే ప్రార్థనా స్థలాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించబడగా, శాంతి, సౌభ్రాతృత్వం, సమాజ శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి వయస్సు వారు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. డప్పుల మోగింపులు, సాంప్రదాయ కళ ప్రదర్శనలు, మతపరమైన కార్యక్రమాల మధ్య తాజియాల ఊరేగింపులు పట్టణ ప్రధాన వీధుల గుండా సాగి ప్రజల దృష్టిని ఆకర్షించాయి. ఈ వేడుకల ప్రత్యేకతగా మత భేదాలకు అతీతంగా ఇతర వర్గాల ప్రజలు కూడా పాల్గొని పరస్పర గౌరవాన్ని చాటుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ సామాజిక ఐక్యతను ప్రతిబింబించారు. దీంతో మంచిర్యాలలో మొహరం వేడుకలు కేవలం మతపరమైన కార్యక్రమాలకే పరిమితం కాకుండా, సామరస్యానికి ప్రతీకగా నిలిచాయి.వేడుకలు ప్రశాంతంగా సాగేందుకు పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. ముఖ్య కూడళ్ల వద్ద అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మంచిర్యాల పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు అప్రమత్తంగా వ్యవహరించారు. మొత్తంగా మంచిర్యాల నగరంలో మొహరం వేడుకలు భక్తి, శాంతి, సోదరభావం సందేశాన్ని చాటుతూ ఘన విజయంగా నిలిచాయని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ వేడుకలు సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం మరింత బలపడేందుకు దోహదం చేశాయని పలువురు పేర్కొన్నారు.

**కెరమెరి జూన్ 26 ప్రభాతవార్త:**

ధర్మం, సత్యం, త్యాగానికి ప్రతీక మొహర్రం పండుగ అని కెరమెరి సర్పంచ్ పెందోర్ ఆనందరావు అన్నారు. శుక్రవారం కెరమెరిలో మొహర్రం సందర్భంగా మత సామరస్యాన్ని చాటుతూ ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన షర్బత్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు కుల మతాలకు అతీతంగా షర్బత్ పంపిణీ చేశారు. ఇమామ్ హుస్సేన్ త్యాగాలను స్మరించుకుంటూ ముస్లింలు జరుపుకొనే వేడుకలో ప్రజలు కులమతాలకు అతీతంగా పాల్గొంటారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అబ్దుల్ కలాం, ఇఫ్తేకర్ దేశ్ముక్, మున్ను, ముస్లిం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్, జూన్ 26, ప్రభాతవార్త :**

మొహరం పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని జామియా మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో షర్బత్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్, మైనార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్ మాట్లాడుతూ మొహర్రం అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, అది త్యాగానికి, సత్యానికి, ధర్మానికి, మానవతా విలువలకు ప్రతీక అని కొనియాడారు. లోకకళ్యాణం, సమాజంలో శాంతిని నెలకొల్పడం కోసం హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన మహోన్నత త్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కోరారు. కులమతాలకు అతీతంగా సోదరభావంతో అందరూ కలిసిమెలిసి జీవించడమే మొహర్రం పండుగ యొక్క అసలైన సందేశమని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు షబ్బీర్, మైనారిటీ నాయకులు షేక్ షాకీర్, సాలం, నజీర్, అఖిల్, సర్దార్, సాజీద్, మాజిద్, స్థానిక ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

**మంచిర్యాల రూరల్, జూన్ 26, ప్రభాతవార్త**

మొహర్రం పర్వదిన వేడుకలను శుక్రవారం పాత మంచిర్యాలలో ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ చౌరస్తాలో పీర్లు (ఆలమ్) ప్రత్యేకంగా అలంకరించి ఉంచగా కులమతాలకు అతీతంగా భక్తులు పీర్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. వేడుకల సందర్భంగా భక్తులకు తాగునీరు, శర్బత్, ప్రసాదం పంపిణీ చేశారు. యువకులు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొని ఏర్పాట్లను విజయవంతం చేశారు. శాంతియుత వాతావరణంలో జరిగిన ఈ వేడుకల్లో మహిళలు, చిన్నారులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సామరస్యానికి ప్రతీకగా నిలిచారు. ఇమామ్ హుస్సేన్ త్యాగాన్ని స్మరిస్తూ సత్యం, ధర్మం పేరుతో మొహర్రం వేడుకలు జరుపుకుంటామని స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు వేడుకలను సందర్శించి ప్రజలకు మొహర్రం శుభాకాంక్షలు తెలిపారు.



పీర్ల దేవుళ్లకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



షర్బత్ పంపిణీ చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్

# గంజాయి రహిత మంచిర్యాలే లక్ష్యం

### యువత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్, ఉప పోలీసు కమిషనర్ పిలుపు

**మంచిర్యాల, జూన్ 26: ప్రభాతవార్త**

మాదకద్రవ్యాల వినియోగం సమాజానికి మహమ్మారిగా మారుతోందని, ముఖ్యంగా యువత వాటి బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల ఉప పోలీసు కమిషనర్ ఎ. భాస్కర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంచిర్యాలలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, మంచిర్యాల సహాయ పోలీసు కమిషనర్ ఆర్. ప్రకాష్ పర్యవేక్షణలో, మంచిర్యాల పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోద్‌రావు ఆధ్వర్యంలో రెండు కిలోమీటర్ల అవగాహన పరుగు నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా వరకు సాగింది.ఈ సందర్భంగా ఉప పోలీసు కమిషనర్ ఎ. భాస్కర్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీసు శాఖ నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, విక్రయం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే అత్యవసర సేవల సంఖ్య 100 లేదా ఉచిత సహాయ సంఖ్య 1908 కు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు బానిసైన వారి పునరావాసం కోసం వ్యసన విముక్తి కేంద్రాల ద్వారా వైద్య చికిత్స, సలహా సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. "మాదకద్రవ్యాలకు 'నో' చెప్పండి.. ఆరోగ్యకరమైన జీవితానికి 'యెస్' చెప్పండి" అనే సందేశాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో 13వ బెటాలియన్ కమాండెంట్, సహాయ పోలీసు కమిషనర్ ఆర్. ప్రకాష్, పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోద్‌రావు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, యువత, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## చెన్నూరులో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ

### యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్

**చెన్నూరు, జూన్ 26, ప్రభాతవార్త**



యువత మత్తు పదార్థాలకు బానిసై మంచి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ యువతకు సూచించారు. మంచిర్యాల జిల్లా స్థానిక చెన్నూరు పట్టణంలో శుక్రవారం రోజు అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ, మానవహారం కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు, విద్యార్థులు, యువత కలిసి ప్రజలకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల బానిసత్వం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబాలు, సమాజం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, మంచి అలవాట్ల వైపు దృష్టి సారించాలని ఏసీపీ వెంకటేశ్వర్ సూచించారు. అనంతరం చెన్నూర్ బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించి మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు ఎస్ఐ రాజశేఖర్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా ఛత్రపతి సాహు మహారాజ్ జయంతి

వాంకిడి,జూన్ 26, ప్రభాతవార్త :



బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి రిజర్వేషన్ పితామహుడు ఛత్రపతి సాహు మహారాజ్ జయంతిని వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్ లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షులు డాక్టర్ అశోక్ మహుల్కర్ మాట్లాడుతూ భారత దేశంలో అందరి తోపాటు బడుగు బలహీన వర్గాలు కూడా అభివృద్ధి చెందుతేనే దేశం సుభిక్షంగా ఉంటుందని మొట్టమొదటిసారిగా మన రాజ్యంలో వారికి రిజర్వేషన్ కల్పించిన పితామహుడు సాహు మహారాజని అన్నారు. అంబేద్కర్ ఉన్నత చదువులు చదవడానికి పూర్తి సహకారం అందించడం వలన దళిత వర్గానికి చెందిన అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగా, సింబల్ ఆఫ్ నాలెడ్జ్ కా గల్గారని ఆయన పేర్కొన్నారు.భారత రాచరిక రాష్ట్రమైన కొల్హాపూర్ చారిత్రలో మొదటి చక్రవర్తిగా వెలుగొందిన సాహుమహారాజ్ గొప్ప సామ్రాజ్య వాదిగా ,సంఘసంకర్తగా మన్ననలు పొందిన యాదవ రాజు అని అన్నారు.ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ జిల్లా ఆర్గనైజర్ రోషన్,భారతీయ బౌద్ధ మహా సభ మండల అధ్యక్షులు దుర్గం దూర్గాజి, కార్యదర్శి రాంటేకే ప్రతాప్,రమా బాయి మహిళా మండలి అధ్యక్షులు కొబ్రాగడే గంగుబాయి,నాయకులు దుర్గం శ్రీనివాస్ మహత్మే రాజేంద్ర ప్రసాద్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కదిలి పాపహరేశ్వర ఆలయ నూతన ఈవోగా రాజేశ్

దిలావర్‌పూర్, జూన్ 26, ప్రభాతవార్త:



దిలావర్‌పూర్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కదిలి శ్రీ మాత అన్నపూర్ణ పాపహరేశ్వర స్వామి ఆలయ నూతన కార్యనిర్వహణాధికారిగా రాజేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు, సిబ్బంది ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఈవో రాజేశ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దక్షిణ కాశీగా పేరుగాంచిన కదిలి క్షేత్ర సమగ్ర అభివృద్ధికి, దూరప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రత్యేక కృషి చేస్తానని పేర్కొన్నారు.

### మాజీ ఈవో సదయ్యకు ఘన వీడ్కోలు..

అనంతరం ఇక్కడ తన పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని బదిలీపై వెళ్తున్న మాజీ ఈవో సదయ్య సేవలను ఆలయ సిబ్బంది, పూజారులు ప్రత్యేకంగా కొనియాడారు. ఆయన హయాంలో ఆలయంలో జరిగిన అభివృద్ధి పనులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఈవో సదయ్యకు ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చక బృందం శాలువా కప్పి, స్వామివారి జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# రోడ్డుపై గుబులు పుట్టిస్తున్న పందులు..

## - గ్రామస్తులకు నిత్యం ప్రాణభయం

దిలావర్‌పూర్, జూన్ 26, ప్రభాతవార్త:



దిలావర్‌పూర్ మండల కేంద్రంలో పందుల సంచారం రోజురోజుకూ విపరీతంగా పెరుగుతూ స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ప్రధాన రహదారులు, గ్రామంలోని అంతర్గత వీధులు అనే తేడా లేకుండా గుంపులు గుంపులుగా తిరుగుతున్న పందులు వాహనదారులకు, ప్రజలకు నిత్యం ప్రాణభయాన్ని కలిగిస్తున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు ఎప్పుడు ఏ పంది అడ్డువచ్చి ప్రమాదం జరుగుతుందోననే ఆందోళనతో ప్రయాణించాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఈ పందుల సమస్యను గత కొన్ని సంవత్సరాలుగా మండల స్థాయి అధికారుల నుంచి జిల్లా కలెక్టర్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి శాశ్వత పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కోతులు, వీధి కుక్కల సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఇప్పుడు పందుల బెడద మరింత అదనపు భారంగా మారిందని చెబుతున్నారు. పందులు వీధుల్లోని చెత్తకుప్పల వద్ద సంచరిస్తూ గ్రామంలో తీవ్ర అపరిశుభ్ర వాతావరణాన్ని సృష్టిస్తున్నాయని, దీనివల్ల దోమల ఉధృతి పెరిగి వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వేగంగా వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిసార్లు ఆహారం కోసం పందులు నేరుగా ఇళ్లలోకి చొరబడుతున్న ఘటనలు కూడా తరచూ జరుగుతున్నాయని తెలిపారు.



పందులు అడ్డురావడంతో యువకుడికి తీవ్ర గాయాలు

గురువారం సాయంత్రం గ్రామానికి చెందిన పీసరి సతీష్ అనే యువకుడు అత్యవసర పనిమీద ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, ఒక్కసారిగా పందుల గుంపు రోడ్డుపైకి రావడంతో తప్పించబోయి ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే స్పందించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని, పందులు గుంపులుగా అకస్మాత్తుగా రహదారులు దాటడం వల్లే వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.ఒకవైపు రహదారి ప్రమాదాలు, మరోవైపు అపరిశుభ్రతతో వ్యాధుల ముప్పు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో.. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా వెంటనే స్పందించి దిలావర్‌పూర్‌లో పందుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామ ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. మున్సిపల్, పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి గ్రామ ప్రజలను, వాహనదారులను ఈ పందుల బెడద నుంచి విముక్తి కల్పించాలని వారు కోరుతున్నారు.



# మత్తు బారిన పడిన వారికి నూతన జీవితం

## - వ్యసన విముక్తి కేంద్రంలో చికిత్స, సలహా సేవలు పరిశీలించిన మంచిర్యాల ఉప పోలీసు కమిషనర్ ఏ భాస్కర్

మంచిర్యాల, జూన్ 26, ప్రభాతవార్త

మత్తు పదార్థాలకు బానిసలై మానసిక, శారీరక సమస్యలతో బాధపడుతున్న వారికి సమర్థవంతమైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మంచిర్యాల ఉప పోలీసు కమిషనర్ ఎ. భాస్కర్ తెలిపారు. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వ్యసన విముక్తి కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితి, వారికి అందుతున్న వైద్య సేవలు, సలహా కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. బాధితులు త్వరగా సాధారణ జీవితంలోకి రావడానికి వైద్యులతో పాటు మానసిక ధైర్యం కూడా అవసరమని పేర్కొన్నారు. అనంతరం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆధ్వర్యంలో బాధితులకు వినోదంతో పాటు మానసిక ప్రశాంతత కలిగించే ఆట వస్తువులు పంపిణీ చేశారు. ఇందులో చదరంగం పలకలు, గుళికల ఆట పలకలు తదితర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల సహాయ పోలీసు కమిషనర్ ఆర్. ప్రకాష్, మంచిర్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌రావు, ఉప నిరీక్షకుడు ఆది మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# పోలియో నిర్మూలనకు సమష్టి కృషి అవసరం

## - జూన్ 28న పోలియో చుక్కలు.. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా వేయించాలని వైద్యశాఖ పిలుపు

మంచిర్యాల, జూన్ 26 ప్రభాతవార్త

జిల్లాలో పోలియో నిర్మూలన లక్ష్యంగా ఈ నెల 28న ప్రత్యేక పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు.మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం పోలియో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు, బ్యానర్లు, ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ, జిల్లాలోని 459 పోలియో కేంద్రాల ద్వారా ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు.జిల్లాలో మొత్తం 76,397 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో వ్యాక్సిన్ అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఇందుకోసం 1,836 మంది వైద్య సిబ్బందిని నియమించి, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మొబైల్ వైద్య బృందాల ద్వారా కూడా సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు అందించే కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఏ చిన్నారి కూడా పోలియో చుక్కలు మిస్ కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, రషీద్, కాకిరాల వెంకటేశ్వర్లు, నాందేవ్, పుట్ట సత్తయ్య, శ్రీనివాస్, జిల్లా ప్రజారోగ్య నర్సు పద్మ, జిల్లా ఔషధ నిపుణుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# 20 ఏళ్ల సేవకు ఇదేనా ప్రతిఫలం..

**- రెవెన్యూ శాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆవేదన**



**భైంసా, జూన్ 26, ప్రభాతవార్త:**

రెవెన్యూ శాఖలో గత రెండు దశాబ్దాలుగా విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నేడు ఉద్యోగ భద్రత లేక తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్లు, టైపిస్టులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పనిచేస్తూ శాఖ కార్యకలాపాల నిర్వహణలో కీలక పాత్ర పోషించిన తమను ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూపకుండా విధుల నుంచి తొలగించడం బాధాకరమని ఉద్యోగులు వాపోతున్నారు. భూముల రికార్డుల నిర్వహణ, ధరణి సేవలు, రెవెన్యూ పరిపాలనా కార్యక్రమాలు, ఎన్నికల విధులు, ప్రకృతి విపత్తుల సమయంలో అత్యవసర సేవలు వంటి అనేక కీలక ప్రభుత్వ కార్యక్రమాల్లో తాము అంకితభావంతో పనిచేశామని వారు గుర్తు చేశారు. అయితే 20 సంవత్సరాలుగా నిరంతరాయంగా సేవలందించిన తమకు నేడు ఉద్యోగ భద్రత కల్పించకుండా నిర్దాక్షిణ్యంగా వ్యవహరించడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికితోడు ఇప్పటికే గత 12 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో కుటుంబ పోషణ పూర్తిగా భారంగా మారిందని ఉద్యోగులు పేర్కొన్నారు. చేతిలో పైసలు లేక పిల్లల చదువులు, అత్యవసర వైద్య ఖర్చులు, నిత్య జీవిత అవసరాలు కూడా తీర్చలేని దయనీయ పరిస్థితి నెలకొందని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రెవెన్యూ శాఖలో దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తగిన ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. నిబంధనల పేరుతో తొలగించిన ఉద్యోగులను మానవతా దృక్పథంతో తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న 12 నెలల వేతనాలను వెంటనే విడుదల చేసి తమ కుటుంబాలను ఆదుకోవాలని బాధిత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. రెండు దశాబ్దాల పాటు ప్రభుత్వ సేవలోనే గడిపిన ఉద్యోగులను ఇలా రోడ్డున పడేయడం న్యాయం కాదని, ప్రభుత్వం స్పందించి వేలాది కుటుంబాలకు భరోసా కల్పించాలని పలు ప్రజాసంఘాలు కూడా కోరుతున్నాయి.



## సొంత ఇంటి కల ఫలించేదేలా..

**లింగాపూర్, జూన్ 26, ప్రభాతవార్త**


లింగాపూర్ మండలంలోని జముల్దరా గ్రామపంచాయతీ పరిధిలో,గ్రామాలైన మోతిగూడ, కన్నేపల్లి,సిడాంగూడా, గ్రామాలకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం జరిగింది, పూరి గుడిసెలు,రేకుల ఇల్లు ఈదురు గాలులు వస్తే గాలికి ఎటు లేచిపోతాయో భయంతో నివసించే వాళ్లము.ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో గ్రామాలలో ప్రజలు సంతోష వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులు గ్రామంలోని ప్రజలందరూ ప్రారంభించడంతో గ్రామంలోని పండుగ వాతావరణం ఏర్పడింది. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మా సొంత ఇంటి కల నెరవేర్చిందని సంతోషవ వ్యక్తం చేస్తూ నిర్మాణ పనులు ప్రారంభించగా ఫారెస్ట్ అధికారులు మీ ప్రాంతం బప్పర్ జోన్ ఏరియాలో ఉన్నాదని ఈ ప్రాంతంలో ఇల్లు నిర్మించరాదని,తెలపడంతో సంతోషమనేది మూన్నాళ్ళ ముచ్చటగా మిగిలిపోయింది, మేము తాత ముత్తాతల కాలం నుండి ఈ ప్రాంతంలోనే నివసిస్తున్నాము మేము ఎక్కడికి వెళ్లి బతకాలి, అని గ్రామస్తులు వాపోయారు, ఏకాంగ ఫారెస్ట్ అధికారులు ఎలాంటి నిర్మాణాలు చేయరాదనినోటీసులు ఇవ్వడంతో, ఇంటి నిర్మాణాలు పునాది వరకు నిర్మించి ఆగిపోయినాయి, అధికారుల చుట్టు తిరిగి తిరిగి అలసిపోయినం ఎక్కడికి వెళ్లి బతకాలి ఇకనైనా అధికారులు మా బాధను అర్థం చేసుకొని సొంత ఇంటికాల నెరవేర్చే విధంగా సత్వరమే చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు మాకా శ్రీను,సిడం రాజేశ్వర్, కనక లింభారావ్,ఆడ యాదోరావ్, తదితరులు వాపోయారు.

## సబ్సిడీ సోయా విత్తనాల పంపిణీ

**- సర్పంచ్ సిరం సుష్మారెడ్డి**

**భైంసా, జూన్ 26, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని దేగాం గ్రామంలో వంద శాతం సబ్సిడీపై మహిళా రైతులకు సోయా విత్తనాలను గ్రామ సర్పంచ్ సిరం సుష్మారెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలోని మహిళా రైతు సంఘాల్లో సభ్యులుగా ఉన్న 60 మంది మహిళా రైతులకు ఒక్కో బస్తా చొప్పున సోయా విత్తనాలను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం సమృద్ధి కోసం ఎన్నో రకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందని కొనియాడారు. మహిళా పరస్పర సహాయక సంఘాల ద్వారా గ్రామీణ మహిళలు అన్ని రంగాల్లో చొరవ చూపుతూ, ఆర్థికంగా రాణిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ఇలాంటి రాయితీలను సద్వినియోగం చేసుకుని మహిళలు వ్యవసాయ రంగంలో మరింత ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు, వార్డు సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.





## నాగపురివాడలో నూతన బోరింగ్ ప్రారంభం

**ఆసిఫాబాద్ టౌన్, జూన్ 26, ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్ మండలం రాజంపేట గ్రామపంచాయతీ పరిధిలోని టీఆర్ నగర్ సమీపంలోని నాగపురివాడలో సుదీర్ఘకాలంగా నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నూతన బోరింగ్‌ను శుక్రవారం గ్రామ సర్పంచ్ బుర్సా పోచయ్య, జిల్లా వార్డు మెంబర్ ఫోరం అధ్యక్షుడు, వార్డు సభ్యుడు గులాం జావీద్, ఉపసర్పంచ్ మామిడి లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ప్రాంతానికి మౌలిక వసతులు కల్పించడమే పాలకవర్గం లక్ష్యమని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే దిశగా గ్రామపంచాయతీ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలో ఏమైన సమస్యలు ఉంటే త్వరగా పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బొట్టుపెల్లి లావణ్య, ప్రశాంత్, జాబారి కిషోర్, కుంరం వేణు, పంచాయతీ కార్యదర్శి సాయి కృష్ణ, బీసీ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావు పటేల్ పరామర్శ యాత్ర

**- కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలని పిలుపు**

**భైంసా, జూన్ 26, ప్రభాతవార్త:**

ముధోల్ మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బోస్లే నారాయణరావు పటేల్ శనివారం భైంసా పట్టణంతో పాటు కుబీర్ మండలంలో పరామర్శ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. భైంసా పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త సుధాకర్ ఇటీవలే గుండెపోటుతో అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న బోస్లే నారాయణరావు పటేల్ రేపు భైంసాలోని సుధాకర్ నివాసానికి వెళ్లి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర సానుభూతిని తెలియజేయనున్నారు. ఈ పరామర్శ అనంతరం ఆయన కుబీర్ మండలంలోని గోడపూర్ గ్రామానికి చేరుకుని, అక్కడ ఇటీవల మరణించిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానికుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చనున్నారు. ఈ నేపథ్యంలో ముధోల్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఉప సర్పంచులు, వివిధ మండలాల మార్కెట్ కమిటీల చైర్మన్లు, డైరెక్టర్లు, ఆత్మ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లతో పాటు బోస్లే నారాయణరావు పటేల్ అభిమానులు, అనుచరులు అందరూ ఈ పరామర్శ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పిలుపునిచ్చారు.

## రోడ్డుపై మురుగు నీటి ప్రవాహం

**- ఇక్కట్లు పడుతున్న పాదచారులు**

**- మందకొడిగా సాగుతున్న రోడ్డు విస్తరణ పనులు**

**చెన్నూరు, జూన్ 26, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా స్థానిక చెన్నూరు పట్టణంలోని అంబేద్కర్ చౌక్ నుండి రావిచెట్టు వరకు రోడ్డు వెడల్పు పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చివేసిన ఇంటి వ్యర్థాలను తొలగించకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా పడి ఉన్నాయి. దీనికి తోడు డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగునీరు రోడ్డుపైకి వస్తుంది. ద్విచక్ర వాహనాల రాకపోకలకు మురుగునీరు పాదాచారుల పై పడడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న వ్యర్థాలను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



## అనుమతి లేకుండా సింగరేణి ఐరన్ పైప్స్ తరలింపు

**- వాహనం సీజ్, కేసు నమోదు**

**నస్పూర్, జూన్ 26, ప్రభాతవార్త**

సింగరేణి సంస్థకు చెందిన విలువైన ఐరన్ పైపులను ఎలాంటి అనుమతులు లేకుండా దొంగతనంగా తరలిస్తున్న వాహనాన్ని సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నట్లు శ్రీరాంపూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం. సంతోష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం (జూన్ 25) సాయంత్రం 4 గంటల ప్రాంతంలో సింగరేణి ఎస్ అండ్ పీసీ ఉద్యోగి జెట్టి నాగమల్లేశ్వర రావు తన సిబ్బందితో కలిసి శ్రీరాంపూర్ ఏరియాలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సింగరేణి సివిల్ ఆఫీస్‌కు చెందిన సుమారు 110 ఐరన్ పైపులను లోడ్ చేసుకుని వెళ్తున్న ఒక ఐచర్ వ్యాన్‌ను సెక్యూరిటీ సిబ్బంది ఆపి తనిఖీ చేశారు. వాటికి సంబంధించిన ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన ఐరన్ పైపుల విలువ సుమారు రూ. 4,40,000 ఉంటుందని అంచనా. సెక్యూరిటీ సిబ్బంది వ్యాన్ డ్రైవర్ ఎండీ అఖీమ్‌ను, ఆపై సివిల్ ఆఫీస్ బాయ్ ముప్పు రాజును విచారించగా.. సందీప్ అనే సింగరేణి సివిల్ సూపర్‌వైజర్ అనుమతితోనే ఈ పైపులను తరలిస్తున్నట్లు వారు తెలిపారు. ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా సింగరేణి ఆస్తులను దొంగతనంగా తరలించడానికి ప్రయత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ అండ్ పీసీ ఉద్యోగి నాగమల్లేశ్వర రావు శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఎం. సంతోష్ వెల్లడించారు.